## నేడు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాక

**- మేజర్ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం**

మెట్‌పల్లి, నవంబర్ 15: నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం కోరుట్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్, వెల్లుల్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలకేంద్రాలు, కోరుట్ల మండలం ఐలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

**ఐదు తిరస్కరణ, మరో ఐదు ఉపసంహరణ**

**కోరుట్లలో ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు**

మెట్‌పల్లి, నవంబర్ 15 : శాసనసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రకియ బుధవారం సాయంత్రం ముగిసింది. కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించి 25 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా అందులో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మరో ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బీఆర్ఎస్ నుంచి కల్వకుంట్ల సంజయ్, బీజేపీ నుంచి అర్వింద్ ధర్మపురి , కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగరావు తదితరులు పోటీలో ఉన్నారు.

## కూతుర్ని కాలేజీలో దింపేందుకు వెళ్తుండగా..

**రోడ్డు ప్రమాదంలో తండ్రి, మరొకరు మృతి**

**తిప్పన్నపేటలో అదుపుతప్పి బోల్తాపడిన కారు**

జగిత్యాల రూరల్, నవంబర్ 15: బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లి పదిహేను రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. సెలవులకు ఇంటికి వచ్చిన కూతుర్ని కరీంగనర్‌లోని కళాశాలలో దింపేందుకు బంధువులతో కలిసి కారులో బయలుదేరారు. బయలుదేరిన అర గంటలోనే కారు బోల్తా పడడంతో వలస జీవి అక్కడిక్కడే మృతిచెందాడు. కండ్ల ముందే తండ్రి విగతజీవిగా మారడాన్ని చూసిన ఆ యువతి, తన భర్త మృతదేహంపై పడి భార్య రోదనలు అక్కడున్న వారిని కలచివేశాయి. జగిత్యాల రూరల్ ఎస్ఐ సదాకర్, మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన దేవరకొండ భాస్కర్(35) జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి పదిహేను రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. భాస్కర్‌కు భార్య లావణ్య, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు అక్షయ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. దీపావళి సెలవులు కావడంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. సెలవులు ముగియడంతో కూతురిని కరీంనగర్‌లోని కళాశాలలో దింపేందుకు భాస్కర్ బుధవారం రాజారం గ్రామం నుంచి జగిత్యాల రూరల్ మండలంలోని హబ్సీపూర్‌లోని అత్తగారింటికి వచ్చి అక్కడి నుంచి కారులో మామ ఇమ్మడి నందయ్య, బామ్మర్ది శ్రీకాంత్, చిన్నమామ కొడుకు మహేశ్‌తో కలిసి కరీంనగర్ బయలుదేరారు. భాస్కర్ బామ్మర్ది శ్రీకాంత్ కారు నడుపుతుండగా జగిత్యాల వైపు వస్తుండగా, పొలాస సమీపంలో కారు అదుపుతప్పి బోల్తాపడగా, కారులో ఉన్న భాస్కర్, మహేశ్‌కు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందారు. గాయపడ్డ నందయ్య, శ్రీకాంత్, అక్షయను జగిత్యాల దవాఖానకు తరలించారు. కారును శ్రీకాంత్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడుపడంతో అదుపుతప్పి బోల్తా పడిందని, మృతుడు భాస్కర్ భార్య లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సదాకర్ తెలిపారు. ప్రమాదంపై పోలీసులకు దేవరకొండ లావణ్య ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

## కోరుట్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

కోరుట్ల, నవంబర్ 15: పట్టణంలోని కొత్త బస్టాండ్, పలు లాడ్జీల్లో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రయాణికుల బ్యాగులు, ఇతరాత్ర వస్తువులను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వద్ద సోదాలు చేశారు. తనిఖీల్లో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

## మద్యం తరలిస్తే కేసు

తిమ్మాపూర్, నవంబర్ 15: అక్రమంగా మద్యం తరలిస్తున్న మార్క నరేశ్, జంగిలి సంపత్ అనే వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులో మంగళవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా, మార్క నరేశ్ ద్విచక్రవాహనంపై 14 మద్యం బాటిళ్లు తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అలాగే మానకొండూర్ మండలం గంగిపల్లి శివారులో బుధవారం ఉదయం తనిఖీలు చేస్తుండగా, జంగిలి సంపత్ అనే వ్యక్తి పరిమితికి మించి 20 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసునమోదు చేశామని, అలాగే వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ చెప్పారు.

# ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు

- **కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు**
- **రాఘవపేట గ్రామానికి చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక**



పార్టీలో చేరిన కార్యకర్తలతో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, నవంబర్ 15: ప్రజలు ప్రతిపక్ష నాయకుల మాటలను ఎట్టి పరిస్థితుల్లోని నమ్మవద్దని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకుడు మాదం ఎర్రన్నతో పాటు, గంగాధరి రాజారెడ్డి, సుద్దు రవితో పాటు, బీజేపీకి చెందిన మరికొంత మంది కార్యకర్తలు విద్యాసాగర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కరోన లాంటి విపత్కార పరిస్థితుల్లో ప్రజల కష్టాసుఖాలను ప్రతిపక్షపార్టీల నాయకులు ఏనాడూ పట్టించుకోలేదని, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ తన సొంత ఖర్చులతో నియోజకవర్గ ప్రజలకు తన వంతు సాయం చేశారని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో సంజయ్‌ను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అలాగే చిట్టాపూర్ గ్రామానికి చెందిన మేర సంఘం సభ్యులు కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆభ్యర్థి సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కల్వకుంట్ల సరోజన



ఇబ్రహీంపట్నం: వర్షకొండలో వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న డాక్టర్ సమత

# మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశమివ్వండి

- **కారు గుర్తుకు ఓటెసి బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ కల్వకుంట్లను గెలిపించాలి**
- **గ్రామాల్లో పార్టీ శ్రేణుల ప్రచారం**



కోరుట్ల : పట్టణంలో మహిళ ను ఓటు అభ్యర్థిస్తున్న సంజయ్ సతీమణి దీప్తి, ఇతర మహిళ నాయకురాళ్లు

మెట్‌పల్లి, నవంబర్15: పట్టణంలోని 1, 2 వార్డుల్లో కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల తల్లి సరోజన ఇంటింటా ప్రచారం చేశారు. తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం, మళ్లీ అధికారంలోకి వచ్చాక చేపట్టనున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. సేవా భావంతో రాజకీయాల్లోకి వచ్చిన తమ కొడుకు సంజయ్ కల్వకుంట్లను కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని ఆమె పేర్కొన్నారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల, నవంబర్ 15: పట్టణంలోని 25వ వార్డు గాంధీ రోడ్డులో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల సతీమణి కల్వకుంట్ల దీప్తి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్యతో కలిసి గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇక్కడ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, ఆడెపు కమల, యాటం పద్మ, బలిజ పద్మ, రెంజర్ల కల్యాణి, కో ఆప్షన్ సభ్యుడు అన్వర్, మాజీ కౌన్సిలర్ గండ్ర శిల్పారావు, బీఆర్ఎస్ నాయకులు మేన్నేని శ్యామల, దేవ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, నవంబర్ 15: వర్షకొండలో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సంజయ్ సోదరి డాక్టర్ సమత ప్రచారం చేశారు. అలాగే మండలంలోని డబ్బా, బర్ధిపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంజయ్ కల్వకుంట్లను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కంతం భారతి, ఎంపీటీసీ ఫోరం మండలాధ్యక్షుడు పోన్‌కంటి వెంకట్, సర్పంచులు దొంతుల శ్యామల, సంగం సాగర్, ఎంపీటీసీ దేశెట్టి శాంత, బీఆర్ఎస్ నాయకులు మామిడి సురేశ్‌రెడ్డి, రెబ్బాటి రాజేందర్, దేశెట్టి జీవన్, దొంతుల తుక్కారాం, చిన్నరాజన్న, శ్రీనివాస్‌రావు, వాల్గొట్ నరేశ్, సదానందం, సాయి, అజయ్, వినోద్, దిలీప్, గరిగె గంగు, పొల్కం రాజేశ్వరి, నేమూరి పద్మ, సదల లింగు, కంతం ఏసురత్నం, ఎడ్ల గంగు, రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




చెక్‌పోస్టు వద్ద మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

## అంతర్ జిల్లా చెక్‌పోస్టు తనిఖీ

ఇబ్రహీంపట్నం, నవంబర్ 15: ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని గండి హనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు కీలకంగా వ్యవహరిస్తాయని అన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 9 అంతర్‌జిల్లా చెక్‌పోస్టులో సాయుధ బలగాలతో కూడిన పహారాతో 24 గంటల పాటు పకడ్బందీగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోకి అక్రమ మార్గంలో ఎటువంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభపెట్టే వస్తువులను రాకుండా వివిధ శాఖల సమన్వయంతో చెక్‌పోస్టును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రిజిస్టర్‌ను పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.